నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 నిజామాబాద్ మంగళవారం 2 జూలై 2024 ADILABAD NIRMAL



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి

బోథ్, జూలై 1 : చాకలి ఐలమ్మను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం బోథ్ పట్టణంలో నిర్మించిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాటం చేశారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో తెలంగాణ పాఠశాల విద్యలో చాకలి ఐలమ్మ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చారని గుర్తు చేశారు. చాకలి ఐలమ్మను తెలంగాణ తల్లిగా గుర్తించి 2021 సెప్టెంబర్ 26 నుంచి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను నిర్వహించడం గొప్ప విషయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్ పాల్గొన్నారు.

### చదువుతోనే అభివృద్ధి

చదువుతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని, సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో ఉన్న సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఆర్.సంధ్యారాణి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్ పాల్గొన్నారు.

# నకిలీ విత్తన నిందితుల కస్టడీ పూర్తి

ఎదులాపురం, జూలై 1 : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నకిలీ విత్తన కేసు నిందితులు అశోక్‌రెడ్డి, రాజేందర్‌లు గత నెల 24 కోర్టులో లొంగిపోయారు. కాగా.. వారికి కోర్టు 14 రోజులపాటు జ్యుడిషియల్ కస్టడీ విధించి జిల్లా జైలుకు తరలించిన విషయం తెలిసిందే. అయితే పోలీసులు కోర్టు ద్వారా నిందితులను నాలుగు రోజులపాటు కస్టడీకి తీసుకున్నారు. కస్టడీ పూర్తి అయిన తర్వాత నిందితులను సోమవారం కోర్టులో హాజరుపర్చారు. తిరిగి వారిని జ్యుడిషియల్ కస్టడీ ద్వారా జిల్లా జైలుకు పంపించడం జరిగిందని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఏపీవో భీంరావు

# సమస్యల పరిష్కారానికి కృషి

ఉట్నూర్, జూలై 1 : గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు అన్నారు. సోమవారం స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గిరిజన దర్బార్‌లో అర్జీలను స్వీకరించారు. ఇంద్రవెల్లి మండలంలోని ధనోరకు చెందిన జైరాం అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ మంజూరు చేయాలని, మండలంలోని శ్యాంనాయక్ తండాకు చెందిన జనబాయి ఉద్యోగం ఇప్పించాలని, ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన వంశీ ఆర్థిక సహాయం చేయాలని, వేమనపల్లి మండలంలోని మంగణపల్లికి చెందిన పార్వతి ఏదైన ఆశ్రమంలో ఉపాధి కల్పించాలని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు పథకాలు కావాలని, పింఛన్లు, రెండు గదుల ఇండ్లు, వ్యవసాయ పనిముట్లు కావాలని అర్జీలు పెట్టుకున్నారు. ఈ సమావేశంలో ఏవో రాంబాబు, అధికారులు సందీప్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్ పాల్గొన్నారు.




గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న పోలీసులు

# బాలకార్మికులను గుర్తించాలి

**నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల**

నిర్మల్ చైన్‌గేట్, జూలై 1 : బాల కార్మికులను వెట్టిచాకిరి నుంచి విముక్తి కలిగించాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. ఆపరేషన్ ముస్కాన్ పదో విడుతలో భాగంగా చైల్డ్ వెల్ఫేర్, చైల్డ్ ప్రొటెక్షన్, రెవెన్యూ, విద్య, వైద్యం, కార్మిక విభాగాలకు చెందిన అధికారులతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తప్పిపోయిన, వదిలేసిన, రోడ్డుపై భిక్షాటన చేస్తున్న 18 ఏళ్ల వయస్సు లోపు పిల్లలను గుర్తించాలన్నారు. గుర్తించిన బాలలను వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగించడం లేదా పునరావాస కేంద్రాలకు తరలించడం చేయాలని సూచించారు. జిల్లాలో బాలకార్మికులు కనబడితే 100కు గాని 1098 చైల్డ్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సూర్యనారాయణ, భరోసా ఇన్‌చార్జి అధికారి జ్యోతిమని, సోన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

# ఆసుపత్రిని సందర్శించిన హెచ్‌ఐవీ నియంత్రణ జేడీ

నిర్మల్ చైన్‌గేట్, జూలై 1 : నిర్మల్ వైద్య కళాశాల ఆసుపత్రిని సోమవారం రాష్ట్ర హెచ్‌ఐవీ నియంత్రణ సంయుక్త సంచాలకులు రవికుమార్ సందర్శించారు. ఆసుపత్రిలో హెచ్‌ఐవీ చికిత్స కేంద్రం ఏర్పాటు చేయనుండడంతో తగిన వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ జీవీడీఎస్ ప్రసాద్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రవీందర్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మల్ ఆసుపత్రిలో కేంద్రం ఏర్పాటయితే ఈ ప్రాంతవాసులకు చికిత్స అందించడంతో పాటు మందులు, సలహాలు అందనున్నాయన్నారు. అనంతరం ఎంసీహెచ్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, యాక్సిలేటర్ సంస్థ బాధ్యుడు పౌల్, నర్సింగ్ సూపరింటెండెంట్స్ కమలమ్మ, విజయలక్ష్మి, ఉమ్మడి జిల్లా పర్యవేక్షకులు అనిల్‌కుమార్, సతీశ్ ఉన్నారు.



ఆసుపత్రిని సందర్శించిన హెచ్‌ఐవీ నియంత్రణ జేడీ రవికుమార్

# సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి..

**నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**

నిర్మల్ అర్బన్, జూలై 1 : ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు శాఖలవారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన చేపట్టి ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఆర్వో భుజంగ్‌రావు, ఆర్డీవో రత్నకల్యాణి పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

# ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- అధికారులతో సమీక్షా సమావేశం



యంత్రాలను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ఆదిలాబాద్, జూలై 1(నమస్తే తెలంగాణ) : ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో భేటీ నిర్వహించారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా ప్రజలు ప్రయోజనం పొందేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, బొజ్జు, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా పాల్గొన్నారు.

### మీ ప్రాణాలతోపాటుప్రజల ప్రాణాలను కాపాడండి

ఎదులాపురం, జూలై 1 : మీ ప్రాణాలను కాపాడుకుంటూ ప్రజల ప్రాణాలను కాపాడాలని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మావల పార్కులో జిల్లా విపత్తు నిర్వహణ బృందం డీడీఆర్‌ఎఫ్(డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్)ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. డీడీఆర్‌ఎఫ్ సిబ్బంది ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడడమే లక్ష్యంగా విధులను నిర్వర్తించాలని సూచించారు. జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### మొక్కలు నాటిన మంత్రి

వన మహోత్సవంలో భాగంగా మావలలోని హరితవనం, అర్బన్ పార్కులో మంత్రి సీతక్క మొక్కలు నాటారు. ముందుగా మంత్రికి మావల పార్కులో అందుబాటులో ఉన్న వసతులను అధికారులు చూపించారు. సఫారీలో పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వన మహోత్సవంలో భాగంగా 44 లక్షల మొక్కలు నాటేలా లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, ఎఫ్‌ఆర్వో గులాబ్ సింగ్, బీట్ ఆఫీసర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

### దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ

దివ్యాంగులకు సహకార ఉపకరణాలను మంత్రి సీతక్క పంపిణీ చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొనే ముందు ఇచ్చారు. తెలంగాణ దివ్యాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ద్వారా సరఫరా చేసిన మూడు చక్రాల వాహనం, బండి మోటోరిజెడ్ వెహికల్, ల్యాప్‌టాప్, అంధుల కర్రలు, 4జీ ఫోన్, వీల్‌చైర్స్, ఎంపీ3 ప్లేయర్స్, బ్యాటరీ వీల్‌చైర్స్, టీచింగ్‌కి సంబంధించిన పుస్తకాలను అందజేశారు.

### మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి కృషి

ఉట్నూర్ రూరల్, జూలై 1 : ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తానని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం రామలింగం పేట్ నుంచి శ్యాంనాయక్ తండా వరకు రూ.3.75 కోట్లతో నిర్మించిన తారురోడ్డు, వంతెనను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల గౌరవ వేతనం ఏడు నెలల నుంచి రావడంలేదని సీతక్కకు వినతిపత్రం అందించారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ, ఈఈ భీంరావు పాల్గొన్నారు.

### చరిత్ర ఉట్టి పడేలా స్మృతివనం ఏర్పాటు

ఇంద్రవెల్లి, జూలై 1 : ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద చరిత్ర ఉట్టిపడేలా స్మృతి వనం ఏర్పాటు చేసి, అమరవీరుల ఛాయాచిత్రాల ను ఏర్పాటు చేస్తామని మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మె ల్యే బొజ్జు పటేల్ అన్నారు. వీరు అమరవీరుల స్తూపం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్మృతివనం నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. నమూనాను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం రూ. ఒక కోటి మంజూరు చేసిందని, రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు.

కుమ్రం భీం మ్యూజియాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమ్మక్క-సారలమ్మ దేవస్థానంలో 30 ఎకరాల్లో దేవతల చరిత్రను ప్రపంచానికి తెలిసే అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఆర్కా పుష్పలత, రాయిసెంటర్ల సార్‌మేడిలు మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, మెస్రం చిన్ను పటేల్, మెస్రం దుర్గు, తుంరం జుగాదిరావ్, ఆర్డీవో జీవకర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఐటీడీఏ ఈఈ భీంరావ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, అదనపు డీఎంహెచ్‌వో కడిమేత మనోర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తం, మాజీ సర్పంచ్‌లు మెస్రం నాగ్‌నాథ్, సుంకట్‌రావ్, కినక జుగాదిరావ్, ఆదివాసుల నాయకులు ఆర్కా ఖమ్ము, కనక తుకారాం, మెస్రం బాజీరావ్, ఆత్రం భాస్కర్, ఆత్రం సుగుణ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



స్మృతివనం నిర్మాణానికి భూమిపూజ చేస్తూ..



ఏవో రాంబాబు వినతిపత్రం ఇస్తున్న సీఆర్టీలు

# వేతనాలు ఇవ్వకుంటే ధర్నాకు దిగుతాం

ఉట్నూర్, జూలై 1 : ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న సీఆర్టీలు వేతనాలు ఇప్పించాలని సోమవారం ఏవో రాంబాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. తాము ఆశ్రమాల్లో పనిచేస్తూ పదో తరగతిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచుతున్నామన్నారు. కానీ.. ప్రభుత్వం తమను నిర్లక్ష్యంగా చూస్తున్నదన్నారు. వేతనాలు సరిగా ఇవ్వకుంటే ఈనెల 15 నుంచి ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్సకోల తిరుపతి, డీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు శామ్యూల్, సంఘం సభ్యులు వంశీ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న వెండి పట్టీలను చూపుతున్న పోలీసులు

# చోరీ కేసులో మహిళ అరెస్టు

ఎదులాపురం, జూలై 1 : వెండి పట్టీల చోరీ కేసులో మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ వన్ టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 21వ తేదీన పట్టణంలోని శ్రీ గణేశ్ నగల షాపులో ముగ్గురు మహిళలు కిలో వెండి పట్టీలను దొంగిలించారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. షాపు యజమాని వంశీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఉదయ్‌కుమార్ కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఉషాబాయిని మహిళా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి కిలో వెండి పట్టీలను స్వాధీనం చేసుకున్నారు. ఉషాబాయి మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లాలో దేవ్‌గావ్‌కు చెందినట్లు సీఐ తెలిపారు. మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఇందులో సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ జాకీర్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాహత్, వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ రాధ, కానిస్టేబుల్ పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

# నూతన చట్టాలతో దర్యాప్తు వేగవంతం

**నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల**



మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, జూలై 1 : దేశవ్యాప్తంగా అమలు చేసిన నూతన చట్టాలతో కేసుల దర్యాప్తు వేగవంతం, బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. సోమవారం నూతన చట్టాల అమలులో భాగంగా నిర్మల్ జిల్లాలోని లక్ష్మణచాంద పోలీస్‌స్టేషన్‌లో తొలి కేసును నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు విధానం, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు సమర్థవంతంగా సత్వర సేవలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు.

### జిల్లాలో తొలి కేసు నమోదు..

లక్ష్మణచాంద మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామానికి చెందిన దేశబోయిన పోశెట్టి సోమవారం ఉదయం నర్సాపూర్ చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు వల చుట్టుకుని చెరువులో మునిగిపోయాడు. జూలై 1 నుంచి నూతన చట్టాలు అమలు కావడంతో నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు డీఎస్పీ గంగారెడ్డి, సీఐ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్సై సుమలత తొలి కేసును నమోదు చేశారు.

# భైంసా ఏఎస్పీగా అవినాశ్ కుమార్



ఏఎస్పీ అవినాశ్ కుమార్

భైంసా, జూలై 1 : ఏఎస్పీగా అవినాశ్ కుమార్‌ను భైంసాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేసిన కాంతిలాల్ పాటిల్ హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా బదిలీ అయ్యారు. ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా అవినాశ్ కుమార్ కమాండర్ గ్రేహౌండ్స్ నుంచి ఏఎస్పీగా భైంసాకు వస్తున్నారు.

# 10లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఎదులాపురం, జూలై 1 : సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ కోసం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల తెలంగాణ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఏర్పాటు చేశామని డీఎస్సీడీవో భగత్ సునీత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ,(బీసీ-ఈ, పీడబ్ల్యుడీ)లో అర్హులైన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ వరకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ http//:tsstudycircle.co.in లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఈ నెల 21న నిర్వహించే ప్రవేశ పరీక్ష ద్వారా అభ్యర్థులకు ఎంపిక చేసి పది నెలలపాటు ఉచిత భోజన వసతితోపాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. అభ్యర్థులు కుటుంబ వార్షిక ఆదాయం సంవత్సరానికి రూ.3లక్షలు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ(బీసీ-ఈ, పీడబ్ల్యుడీ) అభ్యర్థులు జనరల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9494149416కు సంప్రదించాలన్నారు.

# ఉపాధ్యాయులకు ప్రమోషన్స్

నిర్మల్ అర్బన్, జూలై 1 : నిర్మల్ జిల్లావ్యాప్తంగా ఇటీవల జరిగిన బదిలీల్లో 735 మంది ఎస్జీటీలు బదిలీ అయ్యారని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. 895 మంది బదిలీకి దరఖాస్తు చేసుకోగా.. 734 మంది బదిలీ అయ్యారు. ఇంకా 146 మంది బదిలీ పొందక ప్రస్తుత స్థానంలో కొనసాగుతున్నారని పేర్కొన్నారు.

# పురుగుల మందు తాగి ఒకరు మృతి

**కొత్త చట్టాల ప్రకారం తొలి కేసు**

ఎదులాపురం, జూలై 1 : మావల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. క్వినట్ పల్సి గ్రామానికి చెందిన ఎల్మావార్ నకుల్ రెడ్డి(36) ఐదేండ్లుగా జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తు ఉండేవాడు. కొన్ని నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. తరుచుగా గొడవలు కావడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. సోమవారం తండ్రి భూమారెడ్డికి ఫోన్ ద్వారా పురుగుల మందుతాగి చనిపోతున్నానని చెప్పాడు. ఎక్కడ ఉన్నవ్ అని తండ్రి అడగడంతో పాలిటెక్నిక్ కళాశాల గెట్ వద్ద ఉన్నానని చెప్పాడు. తండ్రి అక్కడికి వెళ్లే సరికి స్థానికులు రిమ్స్‌కు తరలించారు. మార్గమధ్యలోనే మృతిచెందినట్లు తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నూతన చట్టం భారతీయ న్యాయ సంహిత 194 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.